సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం, 14, మే, 2025



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.28 వేలు, కనిష్టంగా రూ.5,350 ప్రకారం ధర పలికాయి.



ముగిసిన బుద్ధ పౌర్ణమి వేడుకలు
ప్రశాంతి నిలయంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు మంగళవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
8లో

గరిష్టం/కనిష్టం
37.2°/20.4°
వర్షాల ప్రభావంతో జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవి తాపం మాత్రం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

జగన్ వెంట జనసాగరం


బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద జగన్‌తో కరచాలనం కోసం పోటీపడుతున్న అభిమానులు


మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, శంకరనారాయణ, మాధవ్


జవాన్ మురళీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మక్బూల్, చాంద్‌బాషా, శ్రీధర్‌రెడ్డి, గిరిజమ్మ


జగన్ కాన్వాయ్ వెంట జాతీయ జెండాలతో అభిమానులు

- అగ్నివీర్ మురళీనాయక్ కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ
- బెంగళూరు నుంచి కల్లితండా వరకూ జగన్‌కు అడుగడుగునా నీరాజనం
- రోడ్డుకు ఇరువైపులా నిలబడి 'జై జగన్' అంటూ నినాదాలు
- కల్లితండాకు తరలివచ్చిన ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు
- వైఎస్ జగన్ రాకతో భావోద్వేగానికి గురైన మురళి తండ్రి శ్రీరామ్‌నాయక్
- లే.. మురళి.. జగన్ సర్ వచ్చాడు.. లేచి సెల్యూట్ చేయి అంటూ కన్నీరు


కల్లితండాలో అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'జై జవాన్' నినాదం మార్మోగింది. కుగ్రామం కల్లితండాలో జనసునామీ పోటెత్తింది. అమర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం రాగా.. అభిమాన గణం వెంట నడిచి జవాన్‌కు అశ్రు నివాళులర్పించింది.


మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలను పరామర్శిస్తున్న వైఎస్ జగన్


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్. చిత్రంలో ఉషశ్రీచరణ్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి, మక్బూల్ తదితరులు

సాక్షి, పుట్టపర్తి

'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఈ నెల 8న జమ్ముకశ్మీర్‌లో శత్రుమూకలను చెండాడుతూ వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మురళీ నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతి బాయిలను ఓదార్చారు. మురళి పోరాటాన్ని దేశం గర్విస్తోందని వైఎస్ జగన్ కొనియాడారు. మంగళవారం ఉదయం బెంగళూరులోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్నారు. మురళీ నాయక్ ఇంట్లోకి వైఎస్ జగన్ రాగానే.. జవాన్ తల్లిదండ్రులు భావోద్వేగానికి గురై బోరున విలపించారు. జగన్ రాకతో కల్లితండా జనసంద్రంలా మారింది. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కల్లితండా.. కన్నీరు మున్నీరు..

నాలుగైదు రోజులుగా దిగమింగుకున్న బాధను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో ఒక్కసారిగా భావోద్వేగంతో వ్యక్తపరిచారు. విధి నిర్వహణలో మురళీ నాయక్ త్యాగాన్ని దేశం గర్వించినా.. కన్నతల్లి కంట కన్నీరు మాత్రం ఎవరూ ఆపలేక పోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు జాతీయ జెండాలతో తరలివచ్చారు. గోరంట్ల – పుట్టపర్తి మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు దూరం ఉన్న కల్లితండాకు వచ్చేందుకు గంటకుపైగా సమయం పట్టింది.

గత సర్కారు సంప్రదాయమే..

దేశ రక్షణలో అమరులైన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని మొదట ప్రతిపాదన తీసుకొచ్చి.. అమలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు ప్రకటించడంపై వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరఫున రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు.

మార్మోగిన 'జై జవాన్' నినాదం..

కల్లితండాలోకి వైఎస్ జగన్ ప్రవేశించినప్పటి నుంచి 'జై జవాన్' నినాదం మార్మోగింది. 'భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే' అంటూ అభిమానులు జాతీయ జెండాలతో నినాదాలు చేశారు. మురళీనాయక్ కుటుంబానికి మద్దతుగా నిలిచిన వారందరికీ వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మురళి కుటుంబానికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి జనం రాక..

వైఎస్ జగన్ కల్లితండా పర్యటన నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి వైఎస్ జగన్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. మురళీ నాయక్‌కు ఘన నివాళులర్పించారు.

తరలివచ్చిన నేతలు..

వైఎస్ జగన్ వెంట రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, నియోజకవర్గ సమన్వయకర్తలు ఈరలక్కప్ప (మడకశిర), టీఎన్ దీపిక (హిందూపురం), మక్బూల్ (కదిరి), మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, చౌళూరు మధు మతిరెడ్డి, మాదినేని ఉమామహేశ్వరనాయుడు, మహాలక్ష్మి శ్రీనివాసులు, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

> ''జగనన్నా.. వచ్చావా.. మురళీ ఎక్కడ అన్నా. నువ్వయినా మా బిడ్డ మురళీని వెంట తెస్తావనుకున్నా''
> – వైఎస్ జగన్ పరామర్శించగానే బోరున విలపిస్తూ మురళీ నాయక్ తల్లి జ్యోతిబాయి ఆక్రందన

> ''మురళీ.. పైకి లేచి సెల్యూట్ చేయి.. నీ కోసం జగన్ సర్ వచ్చాడు. మన ఇంటికే జగన్ సర్ వచ్చాడు మురళీ. లే మురళీ.. లేచి సెల్యూట్ చేయి మురళీ''
> – వైఎస్ జగన్‌ను చూడగానే మురళీ నాయక్ తండ్రి శ్రీరాం నాయక్ భావోద్వేగం

> ''మురళీ నాయక్‌ను అయితే తేలేను తల్లీ.. నీ బిడ్డ పోరాటం వృథా కాదు. ఎంతోమందికి రక్షణగా నిలిచి.. చిన్న వయసులోనే ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. మురళీ త్యాగానికి రుణపడి ఉంటాం''
> – మురళీ నాయక్ తల్లిదండ్రులతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దారి పొడవునా నీరాజనం..

చిలమత్తూరు: అమర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి రోడ్డుమార్గంలో కల్లి తండాకు బయలుదేరిన మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దారి పొడవునా జనం నీరాజనం పలికారు. హిందూపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో ఉదయమే బాగేపల్లి టోల్‌ప్లాజ్ వద్దకు వేలాదిగా చేరుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్ రాకకోసం నిరీక్షిస్తూ గడిపారు. వైఎస్ జగన్ కాన్వాయ్ టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే 'జై జగన్' అంటూ నినదిస్తూ జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. తనకోసం ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన అభిమానులను చూసి వైఎస్ జగన్ కారులో నుంచే వారికి అభివాదం చేసుకుంటూ.. నేతలను పలకరిస్తూ ముందుకు సాగారు. అభిమాన తరంగం వెంట రాగా వైఎస్ జగన్ కొడికొండ చెక్‌పోస్ట్, కోడూరు, శెట్టిపల్లి, బూదిలి, గుమ్మయ్యగారిపల్లి క్రాస్, మీదుగా కల్లితండా చేరుకున్నారు. యువత భారీ బైక్ ర్యాలీతో కల్లితండా వరకూ జగన్ కాన్వాయ్‌ను అనుసరించింది.


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు కల్లితండాకు వచ్చిన అశేష జనవాహిని

తిరుగు ప్రయాణంలోనూ అదే అభిమానం..

మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించి రోడ్డు మార్గంలో బెంగళూరు బయలుదేరిన వైఎస్ జగన్‌కు అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. బెంగళూరు మార్గంలోని దారికి ఇరువైపులా నిలబడి 'జై జగన్' అంటూ నినాదాలు చేస్తూ అభిమానం చూపారు.

క్లుప్తంగా

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం

- మంత్రి సవిత



ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

రొద్దం: జిల్లాలోని ప్రతి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేపట్టామని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళీ శాఖ మంత్రి సవిత అన్నారు. రొద్దం మండలం బొక్సంపల్లి క్రాస్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు మంగళవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్తను తయారుచేయడమే లక్ష్యంగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. సొంత ఊళ్లోనే పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

- 17 మండలాల పరిధిలో 13 మి.మీ సగటు వర్షపాతం నమోదు
- రాగల ఐదు రోజులూ వర్ష సూచన



సీకే పల్లి మండలం మేడాపురం వద్ద ప్రవహిస్తున్న వంక



సీకే పల్లి మండలం మొగలాయపల్లి వద్ద ప్రవహిస్తున్న వంక

పుట్టపర్తి అర్బన్/చెన్నేకొత్తపల్లి: మండు వేసవిలో వరుణుడు ప్రతాపం చూపాడు. ఖరీఫ్ పంటలకు మేలు జరిగేలా ముందస్తుగా వర్షించి అందరినీ మురిపించాడు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడి భగభగ మండగా, సాయంత్రం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 17 మండలాల పరిధిలో 13 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొత్తచెరువు మండలంలో 77.6 మి.మీ వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక సీకేపల్లి మండలంలో 74.6 మి.మీ, బుక్కపట్నం 59.4, పుట్టపర్తి 36.2, ధర్మవరం 34.6, నల్లమాడ 24, రామగిరి 23.6, కనగానపల్లి 15.2, కదిరి 15.2, పరిగి 11.6, అగళి 10.2, తలుపుల 7.4, రొళ్ల 7.4, ముదిగుబ్బ 6.8, ఓడీ చెరువు 6.4, పెనుకొండ 2.6, బత్తలపల్లి 1.2, తాడిమర్రి మండలంలో 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

చెన్నేకొత్తపల్లిలో పొంగిపొర్లిన వాగులు, వంకలు..

చెన్నేకొత్తపల్లి మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు వాన కుమ్మేయడంతో ఏకంగా 74.06 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటంపల్లికి వెళ్లే దారిలో ఉన్న వంక పారింది. అలాగే మేడాపురం పంచాయతీ పరిధిలోని పెద్దమొగలాయిపల్లి, చిన్నమొగలాయిపల్లి గ్రామాల వద్ద వంకలు పొంగి ప్రవహించాయి. మేడాపురం, నాగసముద్రం తదితర గ్రామాల చెరువులకు నీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. తాజా వర్షంతో ముంగారు సేద్యానికి రైతులు సిద్ధమవుతుండగా...మూగజీవాలకు మేతతో పాటు అటవీ ప్రాంతంలో తాగునీరు లభిస్తుందని పశువుల కాపరులు చెబుతున్నారు. కాగా, రాగల ఐదు రోజులూ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ప్రశాంతి నిలయంలో ముగిసిన బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధి చెంత రెండు రోజులుగా జరుగుతున్న బుద్ధ పౌర్ణమి వేడుకలు మంగళవారం ముగిశాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడులు ప్రారంభమయ్యాయి. 'ఓం మణి పద్మేహుమ్' పేరుతో బౌద్ధ సన్యాసులు వేద పఠనం గావించారు. సాయంత్రం నేపాల్, శ్రీలంకకు చెందిన భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ సన్నివేశం

ఇది కాదా భద్రతా వైఫల్యం!



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసు జీపును నెడుతున్న సిబ్బంది

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా మంగళవారం పోలీసుల భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ప్రోటోకాల్ ప్రకారం బాగేపల్లి టోల్ ప్లాజా నుంచి భద్రతను పర్యవేక్షిస్తూ వైఎస్ జగన్ కాన్వాయ్‌ను అనుసరించాల్సిన హిందూపురం రూరల్ సీఐ జనార్దన్‌కు కేటాయించిన జీపు టోల్‌ప్లాజా వద్ద మొరాయించింది. ఓ వైపు వైఎస్ జగన్ వస్తున్న తరుణంలో రోడ్డుపై నిలిచిపోయిన జీపును పోలీసులు అతికష్టంపై పక్కకు నెట్టేశారు.

ఆ మూడు స్థానాలకు 19న ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ స్థానానికి ఈ నెల 19న మళ్లీ ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 15న నోటిఫికేషన్ ఇచ్చి, 19న ఎన్నిక నిర్వహించేందుకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భారీ బందోబస్తు మధ్య ఏర్పాటు చేస్తున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎన్నికల అధికారులు రాజోలి రామచంద్రారెడ్డి, జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. కాగా.. గతంలో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ స్థానిక సంస్థల స్థానాలకు మార్చి 27న ఎన్నికలు నిర్వహించారు. అయితే గాండ్లపెంట, రామగిరి ఎంపీపీ స్థానాలతో పాటు కంబదూరు వైస్ ఎంపీపీ స్థానానికి ఎన్నిక వాయిదా పడింది. ఆయా స్థానాలకు మార్చి 28న మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు చర్యలు తీసుకున్నా.. రాజకీయ కారణాలతో వాయిదా పడ్డాయి.

వైఎస్సార్‌సీపీ నేత షెడ్డుకు నిప్పు



మంటల్లో కాలిపోతున్న డ్రిప్ప పరికరాలు

ధర్మవరం రూరల్: మండలంలోని బిల్వంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు హరిని ఆర్థికంగా దెబ్బ తీసేందుకు ఆయన వ్యవసాయ బావి వద్ద ఉన్న షెడ్డుకు మంగళవారం దుండగులు నిప్పు పెట్టారు. మంగళవారం వైఎస్ జగన్ కల్లితండా పర్యటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డితో కలసి ఆయన తరలివెళ్లాడు. హరి గ్రామంలో లేడని తెలుసుకున్న దుండగులు పొలంలో ఉన్న షెడ్డుకు నిప్పు పెట్టడంతో అందులో నిల్వ చేసిన వేరుశనగ బస్తాలు, డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్ల పైపులు, ఇతర వ్యవసాయ పనిముట్లు కాలిబూడిదయ్యాయి. సమీపంలో ఉన్న రైతులు నుంచి సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేలోపు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

'బదిలీల్లో ప్రాధాన్యత కల్పించాలి'

ఓడీచెరువు: ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి కాని ఉపాధ్యాయులను తప్పనిసరి బదిలీ చేయాల్సి వస్తే వారికి ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫుద్దీన్, జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ డిమాండ్ చేశారు.2017, ఆగస్టులో బదిలీ పొందిన ఉపాధ్యాయులను ఎనిమిదేళ్లు పూర్తి కాకుండానే బదిలీల జాబితాలో చేర్చారన్నారు. అలాంటప్పుడు వారికి ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు కేటాయించాలని కోరారు. అప్పుడే అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు.

జీజీహట్టిలో కొలిక్కిరాని అతిసారం

రొళ్ల: పది రోజులుగా రొళ్ల మండలం జీజీహట్టి గ్రామాన్ని వేధిస్తున్న అతిసారం మరోసారి తన ఉనికిని చాటింది. ఇప్పటికే దాదాపు 40 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. ఇందులో అమూల్య (11) మృతి చెందింది. మరికొందరు కోలుకొంటున్నారు. తాజాగా మంగళవారం గ్రామానికి చెందిన శశికళ, చిక్కమ్మ, దొడ్డపూజారప్ప గారి మారన్న అతిసారం బారిన పడడంతో వైద్య, ఆరోగ్య శాఖ ఉలిక్కిపడింది. ఆగమేఘాలపై గ్రామానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ రామారావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మారన్నను మధుగిరిలోని ఆస్పత్రికి, శశికళ, చిక్కమ్మను రొళ్లలోని సీహెచ్‌సీకి తరలించారు. అలాగే అతిసారం లక్షణాలతో బాధపడుతున్న చిక్కీరప్పను హిందూపురం, ఈరమ్మను మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓ వ్యవసాయ బోరుబావిలో నీటిని తాగడం వలనే వాంతులు, విరేచనాలతో ప్రజలు బాధపడుతున్నట్లుగా గుర్తించిన అధికారులు సదరు రైతుకు నోటీసులు జారీ చేశారు. ప్రజలెవ్వరూ ఆ నీటిని వినియోగించరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇంటింటికీ తిరిగి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



జీజీహట్టిలో చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఎం మంజువాణి

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



పద్మావతమ్మ(ఫైల్)



పద్మావతమ్మ నేత్రాలను దానం చేస్తున్న కుటుంబసభ్యులు

కదిరి: మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపునివ్వాలనే సదుద్దేశ్యంతో ఓ మహిళ తన నేత్రాలను దానం చేసింది. వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న కదిరిలోని అడపాలవీధికి చెందిన పద్మావతమ్మ(75) బెంగుళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కన్నుమూశారు. అయితే తాను మరణించాక తన నేత్రాలను దానం చేయాలని ఆమె జీవించి ఉన్న సమయంలోనే కోరడంతో ఆ మేరకు కుటుంబసభ్యులు స్పందిస్తూ ఆమె నేత్రాలను బెంగళూరులోని శంకర్ నేత్రాలయానికి అందజేశారు. ఆమెకు భర్త వెంకటరెడ్డి (సెరికల్చర్ విశ్రాంత ఉద్యోగి), కుమారుడు దేవనందన్‌రెడ్డి, కుమార్తె శ్రీదేవి ఉన్నారు. ఆమె అంత్యక్రియలను బుధవారం ఉదయం 9 గంటలకు కదిరిలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆ ఎస్ఐపై వేటు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయం స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎం. ప్రదీప్‌కుమార్‌పై వేటు పడింది. అతన్ని సరెండర్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఉమ్మడి జిల్లా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రదీప్‌కుమార్ ఉన్నతాధికారుల అండ చూసుకుని లాబీయింగ్ చేసేవారని, డీఎస్పీ, సీఐలను సైతం లెక్క చేయకుండా వ్యవహరించేవారని సమాచారం. దీంతో పాటు రాజకీయ అండతో పంచాయితీలు, పైరవీలు చేస్తుండటంపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో స్పందించిన అనంతపురం రేంజ్ డీఐజీ.. ప్రదీప్‌కుమార్‌ను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



మృతుడు చంద్రమోహన్

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని బాలాజీ నగర్‌లో నివాసముంటున్న చంద్రమోహన్ (53)కు భార్య ఉమాదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.5 లక్షలకు చేరుకుంది. వీటిని ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ కుటుంబసభ్యులతో తరచూ చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం నిద్రలేచిన కుటుంబసభ్యులు.. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న ఇంటి పెద్దను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

క్షణికావేశంలో బాలిక..

మడకశిర రూరల్: స్థానిక పట్టణ పరిధిలోని చీపులేటి గ్రామానికి చెందిన సోమశేఖరరెడ్డి, వనజాక్షమ్మ దంపతుల కుమార్తె హిమశ్రీ(14) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిరలో హోటల్ నిర్వహిస్తూ సోమశేఖరరెడ్డి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం హోటల్‌లో పనులు చేసుకుంటున్న సమయంలో కుమారుడు దినేష్‌రెడ్డి, కుమార్తె హిమశ్రీ టిఫన్ తినే విషయంలో గొడవ పడ్డారు. తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో ఇంటికి చేరుకున్న కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మిద్దెపై నుంచి పడి విద్యార్థి మృతి



రూపేంద్ర (ఫైల్)

ముదిగుబ్బ: ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. ముదిగుబ్బ మండలం మలకవేమల క్రాస్‌లో నివాసముంటున్న మల్లికార్జున కుమారుడు రూపేంద్ర (20)... అనంతపురంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చిన రూపేంద్ర సోమవారం రాత్రి భోజనం ముగించుకుని మిద్దెపైకెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో వర్షం మొదలు కావడంతో కిందకు దిగుతూ కాలు జారి పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రూపేంద్రను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నాబార్డు నిధులు

అనంతపురం సిటీ: గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ ఎస్ఈ మహమ్మద్ జహీర్ అస్లాం మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 37 పనులు మంజూరు కాగా, 123.26 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.49.09 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

జిల్లాలో పనుల వివరాలు..

నియోజకవర్గం	పనుల సంఖ్య	కిలోమీటర్లు	కేటాయించిన నిధులు
ధర్మవరం	2	14.9	రూ.5.00 కోట్లు
హిందూపురం	5	10.2	రూ.3.44 కోట్లు
కదిరి	3	6.8	రూ.3.40 కోట్లు
మడకశిర	3	4.6	రూ.3.00 కోట్లు
పెనుకొండ	2	16.9	రూ.5.80 కోట్లు
పుట్టపర్తి	3	5.87	రూ.2.19 కోట్లు

కదిరి బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): కదిరి ప్రాంతానికి చెందిన ఓ బాలుడికి అరుదైన ఆపరేషన్‌ను కర్నూలు జిల్లాస్పత్రిలో వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. వివరాలు.. కదిరి ప్రాంతానికి చెందిన 15 సంవత్సరాల వయసున్న వేణుగోపాల్‌కు పుట్టుకతోనే మలద్వారం ఏర్పడలేదు. శిశువుగా ఉన్న సమయంలోనే వైద్యులు ఆపరేషన్ చేసి తాత్కాలిక మలద్వారాన్ని ఏర్పాటు చేశారు. అయినా మలవిసర్జన సరిగా కాక ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలో చికిత్స కోసం బాలుడిని గత ఏప్రిల్ 18న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగానికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల నేతృత్వంలో ఈ నెల 7న శస్త్రచికిత్స చేపట్టారు. మలద్వారాన్ని ఏర్పాటు చేసి కండరాలు బలోపేతం అయ్యేలా చేశారు. ఆపరేషన్ అనంతరం అందరిలా మలవిసర్జన చేయగలుగుతుండటంతో మంగళవారం బాలుడిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

'ఉద్యోగ భద్రతా సర్క్యులర్ అమలు చేయాలి'



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి ఎర్రిస్వామి, జాయింట్ సెక్రటరీ నాగరాజు డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చలో డీపీటీఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. చిన్న పాటి కారణాలతో కార్మికులపై వేధింపులకు గురి చేయడం సబబు కాదన్నారు. సిబ్బందికి చెల్లించాల్సిన పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, మహిళా సిబ్బందికి చైల్డ్‌కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని, గ్యారేజ్ సిబ్బందిపై వేధింపులు మానాలని, ఆఫీస్ సిబ్బందికి సరైన కంప్యూటర్లు, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని, సంస్థలో ఖాళీగా ఉన్న 12వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జోనల్ అధ్యక్షుడు నాగశేఖర్, జిల్లా అధ్యక్షుడు ముత్యాలప్ప, శ్రీరామనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి షబ్బీర్, రీజనల్ ఉపాధ్యక్షుడు తిరుపతమ్మ, జాయింట్ సెక్రటరీ విజయమ్మ,తో పాటు ఆరు డిపోల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'పురం' వాసులపై వేధింపుల కేసు నమోదు

గార్లదిన్నె: అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఈ మేరకు వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ప్రమీలకు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన రాజశేఖర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లి సమయంలో 10 తులాల బంగారాన్ని వరకట్నంగా ప్రమీల కుటుంబసభ్యులు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు కట్నం కావలంటూ ప్రమీలను రాజశేఖర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ప్రమీలకు తెలియకుండానే రాజశేఖర్ రెండో పెళ్లి చేశారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లోని వస్తువుల ధ్వంసం

ధర్మవరం అర్బన్: స్థానిక వైఎస్సార్ కాలనీలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి విలువైన వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు రూ.40వేలు నగదు అపహరించారు. బాధితుడు తెలిపిన మేరకు... వైఎస్సార్‌కాలనీలో నివాసముంటున్న వెంకటరాముడు మగ్గం పనులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఇంటికి గడియ పెట్టి బజారుకు వెళ్లిన సమయంలో ఇతరులు ఆ ఇంటికి తాళం వేశారు. తిరిగి ఇంటికి చేరుకున్న వెంకటరాముడు తాళం వేసిన విషయాన్ని గుర్తించి తన కుమారుడు వచ్చాడా అని పక్కింట్లో ఉన్న మీనాక్షిని అడిగాడు. ఆమె తెలియదని సమాధానం ఇవ్వడంతో తన ఇంటికి తాళం వేసిందెవరో అంటూ వెంకట్రాముడు దూషణలకు దిగాడు. దీంతో మీనాక్షి తమ్ముళ్లు వచ్చి వెంకట్రాముడిని చితకబాది, తాళం బద్దలుగొట్టి ఇంట్లోకి ప్రవేశించి టీవీ, కూలర్‌ను ధ్వంసం చేశారు. బీరువాను బద్దలుగొట్టి అందులోని రూ.40వేలు నగదు అపహరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


యూత్ ఐకాన్ ప్రోగ్రాంకు ఎంపిక



విద్యార్థి వర్షిణిని అభినందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థిని కటిక వర్షిణి ఈ నెల 15, 16 తేదీల్లో కర్ణాటకలో జరుగుతున్న ఇంటర్నేషనల్ యూత్ ఐకాన్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని మంత్రి సవిత, పలువురు విద్యార్థులు అభినందించారు.

నేర పరిశోధనలో ఆధారాల సేకరణ కీలకం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నేరస్తులకు పక్కాగా శిక్షలు పడాలంటే నేర స్థలాన్ని శాస్త్రీయంగా పరిశీలించి ఆధారాలు సేకరించాలని సిబ్బందికి ఎస్పీ రత్న సూచించారు. 'ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్''పై డీపీఓలో పోలీసు అధికారులకు మంగళవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. అంతకు ముందు నేర స్థలంలో ఆధారాల సేకరణ, వాటి ప్యాకేజింగ్, భద్రతా ప్రమాణాలు, సిరాలజీ, డీఎన్ఏ, టాక్సికాలజీ, సైబర్ ఫోరెన్సిక్స్ వంటి విభాగాల్లో నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు నేరస్తులు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారని, అలాంటి వారిని సమర్థవంతంగా పట్టుకుని చట్టం ద్వారా శిక్షలు వేయించాలంటే ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారులు కుళ్లాయమ్మ, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్, డీఎస్పీ విజయకుమార్, ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని, తదితరులు పాల్గొన్నారు.